

వ్యాపారులకు జరిమానా

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం నగరంలో వివిధ ప్రాంతాలలో పర్యటించారు. స్థానిక 45 వ వార్డు ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో రోడ్డు మీద పూల వ్యాపారి వేసిన నార ను తొలగించి జరిమానా విధించమని సెక్రటరీని ఆదేశించారు.18 వ వార్డు హరనాథపురం, అపోలో సెంటర్ దగ్గర టమాటో ట్రక్ వ్యాపారులు రోడ్డును అపరిశుభ్రంగా చేయుచున్న కారణంగా జరిమానా విధించి మందలించారు.5 వార్డ్ మైపాడు రోడ్డు ప్రాంతంలోని ఎంఆర్‌పి వైన్ షాపులో వాడుతున్న నిషేధిత డిస్పోజబుల్ గ్లాసెస్, వాటర్ ప్యాకెట్స్ గమనించి వారికి రూ. 20 వేల జరిమానా విధించారు. అక్కడ చెత్తను తగలబెట్టడం గమనించి దాన్ని ఆపి వేయించారు. స్థానిక సచివాలయ శానిటేషన్ సెక్రటరీకి మెమో జారీ చేశారు.7/1 జాఫర్ సాహెబ్ కాలువ వద్ద చెత్తను డంప్ చేయడాన్ని గమనించిన డాక్టర్, వ్యర్థాలు మొత్తం తొలగించాల్సిందిగా ఆదేశించారు.

నీళ్లతో తంట..అంటువ్యాధులు వెంట..!

డయోరియా, జ్వరాలు సర్వసాధారణం - వేసవిలోనూ ప్రజలు ఇబ్బందులు

సీజనల్ వ్యాధులతోపాటు.. జిల్లావ్యాపితంగా తాగునీటి కలుషితం కారణంగా పలు రకాల వ్యాధులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. నెల్లూరు నగరంలో పైప్‌లైన్ లీకేజ్, మురుగునీరు, కలుషిత నీరు తాగడం వంటి ప్రధాన కారణంగా జిల్లా వ్యాపితంగా డయేరియా, విషజ్వరాలు, అమీబియాసిస్, టైపాయిడ్, మలేరియా, వంటి వ్యాధులు తగ్గడం లేదు. పైగా పెరుగు తున్నాయి.. అక్టోబర్, సెప్టెంబర్‌లలో భారీ వర్షాలు, వరదలు సర్వసాధారణం. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో రాలేదు. సోమశిల ప్రాజెక్టులో పై నుంచి వచ్చిన నీటితోనే సాగిపోతోంది. వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎండలు తీవ్రమయ్యాయి. ఇదే సమయంలో తాగునీటి ద్వార వచ్చే వ్యాధులు అలానే కొనసాగుతున్నాయి. ఉధృతం తగ్గినా జ్వరాలు సర్వసాధారణంగా మారిపోయాయి. మున్సిపాల్టీ కార్పొరేషన్ అధికారులు డ్రెయినేజీ, కాలువల క్లీనింగ్, ఫాగింగ్ వంటి చర్యలు చేపడితే ప్రజలు ఇబ్బందుల నుంచి బయటపడే అవకాశం ఉంది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వ నిర్లక్ష్యం, స్వయం శుభ్రత లేకపోవడంతో నెల్లూరు నగరంతోపాటు, జిల్లా వ్యాపితంగా అటు వ్యాధులు సర్వసాధారణమైపోయాయి.సాధారణంగా వర్షాకాలంలో భారీగా గుంటల్లో నీరు చేరడం, డ్రెయినేజీలు పొంగి పొర్లడం, మురుగునీరు చేరడం, పైప్‌లైన్లు పగిలిపోవడంతో మంచినీరు కలుషితం కావడం జరుగుతున్నాయి. వర్షాకాలంలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. జిల్లాకు అక్టోబర్, సెప్టెంబర్‌లలో భారీ వర్షాలు, వరదలు సర్వసాధారణం. ఈ కాలంలో డెంగీ, మలేరియా, టైపాయిడ్, విరోచనాలు, అమీబియాసిస్, హైపటైటస్ చికున్‌గున్యా వంటి వ్యాధులొస్తాయి. సీజనల్, అంటు వ్యాధులు ఈ కాలంలోనే అధికంగా కనిపిస్తాయి. మనకు గతేడాది వరకు సరైన వర్షాలు పడలేదు. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా వ్యాపితంగా కలుషిత నీటి ద్వార అనేక రకాల వ్యాధులు కనిపిస్తున్నాయి. నెల్లూరు నగరంలో పైప్‌లైన్ పగిలి మంచినీటి పైప్‌లో కలవడం ద్వార ఈ నీటిని తాగిన అనేక మంది పలు రకాల వ్యాధుల భా రినపడుతున్నారు. డయేరియా కారణంగా నగరంలోని అనేక ఆస్పత్రుల్లో వాంతులు, విరోచనాలు, కలకలకంతో జనం ఉన్నారు. పొగతోటలోని పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో డయేరియా కేసులున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో రూ.1130 కోట్లతో మంచినీటి పైప్‌లైన్లు, డ్రెయినేజీ సిస్టమ్ ఏర్పాటు చేశారు. 650 కిలో మీటర్లు పైప్‌లైన్ పూర్తి చేయడంతోపాటు, మినరల్ వాటర్ ప్లాంట్స్, ట్యాంకులు సిద్ధమయ్యాయి. కేవలం 15 శాతం పనులు చేయకుండా వైసిపి ప్రభుత్వం అడ్డుపడడంతో ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తాగునీటి పరిస్థితి మారిపోయింది. ఇప్పటి వరకు కంపెనీలకు రూ. 450 కోట్లు చెల్లించారు. ప్రజలకు తాగునీటి వసతి మాత్రం కలగలేదు. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో కార్పొరేటర్లు తాగునీటి విషయంపై గగ్గోలు పెట్టారు. మున్సిపాలిటీ కుళాయి నీళ్లు తాగడం 80 శాతం ప్రజలు మరిచిపోయారు. దీంతో ప్రయివేటు మినరల్ వాటర్ ప్లాంట్ భారీగా పెరిగిపోయాయి. మున్సిపాలిటీ వాటర్, కలుషితం కావడం, మురుగుగుంట వల్ల ప్రస్తుత పరిస్థితి నెలకొంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో మరింత విషమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వ్యాధులు స్వర సాధారణమే ..!

నెల్లూరు నగరంలో కలుషిత నీటి కారణంగా డయేరియా, కలకలకం రేపుతున్నాయి.కొన్ని రోజులుగా బాలాజీనగర్ వంటి కీలక ప్రాంతాల్లోనూ తాగునీరు రావడం లేదు. ప్రజలు మినరల్ వాటర్ కొనుగోలు చేసే పరిస్థితి లేని కారణంగా నిరుపేదలు ఎక్కడ పడితే అక్కడ నీరు తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు వర్షా కాలం, సీజనల్ గా వచ్చే వ్యాధులు ఇప్పుడు సర్వసాధారణంగా మారిపోయాయి. ప్రభుత్వం వేసవి తాపాన్ని తట్టుకోడానికి మంచినీటి కుళాయిలు ఏర్పాటుకు ప్రత్యేక నిధులు కేటాయింపులు చేయలేదు. నెల్లూరు నగరంలోని పొగతోట ప్రయివేటు ఆసుపత్రులతోపాటు, గవర్నమెంట్ ఆసుపత్రుల్లో రోగులున్నారు. వాంతులు, విరోచనాలతో వివిధ రకాల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నగరంలోని బివి నగర్, కోట మిట్ట, కిసాన్‌నగర్, ఎన్‌టిఆర్ నగర్, శాంతినగర్, ఆర్‌టిసిబస్టాండ్ సెంటర్, వెంకటాచలం, మైపాడురోడ్డు, పెద్ద బజార్‌లతో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. కలుషిత ఆహారం, నీళ్లు తీసుకోవడం వల్లే ఈ వ్యాధుల బారినపడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పంచాయతీ అధికారులు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం వల్ల ఈ వ్యాధుల నుంచి రక్షించబ డుతారని డాక్టర్లు చెబుతున్నారు. సాంకేతికత మారు తున్నా ప్రజలు ఇబ్బందుల నుంచి బయటపడడం లేదు.

గ్యాస్ ధరల పెంపుపై ప్రజాగ్రహం..!

సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసనలు

17వ డివిజన్‌లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం దారుణమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. గ్యాస్ ధరల పెంపుదలను వ్యతిరేకిస్తూ సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో రూరల్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సుందరయ్య కాలనీ 23, 24 డివిజన్ సి, డి బ్లాక్, ఒకటి, రెండు డివిజన్స్ నవలాకుల తోట తదితర ప్రాంతాలల్లో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు కె.పెంచలనరసయ్య ఆధ్వర్యంలో, 30 వ డివిజన్ వైయస్సార్ నగర్, కొత్తూరు, మల్లయ్య గుంట ప్రాంతంలో స్థానిక సిపిఎం శాఖ కార్యదర్శి కండె కోటేశ్వరరావు ఆధ్వర్యంలో, 31వ డివిజన్ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ఆంబాపురం, గిరిజన కాలనీ ప్రాంతంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు బి.నాగేశ్వరరావు, ఆ డివిజన్ శాఖ కార్యదర్శి ఎం.సుధాకర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గ్యాస్ ధర పెంపుదలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. 32వ డివిజన్ డైకాస్ రోడ్డు , వెంగళరావునగర్ ప్రాంతంలో సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, రూరల్ కమిటీ సభ్యులు ఎస్‌కె ఖలీల్ ఆధ్వర్యంలో 36 డివిజన్ ప్రాంతంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు నందిపాటి మాలకొండయ్య, అంబేద్కర్ నగర్ సిపిఎం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. 1,2, డివిజన్ ప్రాంతాల్లోనూ నిరసనలు తెలిపారు. 17వ డివిజన్ శాఖ నాయకులు కట్టా సతీష్, నజీర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ముత్తుకూరు రోడ్డు సెంటర్ సమీపంలోని అపోలో వైద్యశాల సర్కిల్ ప్రాంతంలో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50లు పెంచడం దారుణమ న్నారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కే. పెంచల నరసయ్య, ఎండి అజీజ్ ,రూరల్ నాయకులు కండే కోటేశ్వరరావు ,మాల కొండయ్య, సుధీర్, షాహినా బేగం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు :కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. కష్టారెడ్డిపాలెం సిపిఎం సహాయ శాఖ కార్యదర్శి ప్రభావతమ్మ, దామవరపు ఏసుదాసుల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మయ్య, మారుబోయిన రాజా పాల్గొన్నారు. రాజా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలపై మరింత భారాలు మోపుతోందని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ పై రూ. 50 పెట్రోల్, డీజిల్ పై రూ. 2 పెంచుతూ అర్ధరాత్రి నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని రాజా డిమాండ్ చేశారు.తొలుత గ్యాస్ సిలిండర్లతో నిరసన ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మండల కమిటీ సభ్యులు మోచర్ల రాధయ్య, కందిపాటి రమణమ్మ, ఈదురు జానకి, తన్నీరు శ్రావణి, ఉంద్రాళ్ళ రమ, ఇనమాల ఏసోబు, కటకం శ్రీనివాసులు, నెల్లూరు కాంతమ్మ, ఇనమాల మేరమ్మ, తూర రజిని, ధామవరపు ప్రభావతి, దామవరపు మర్రెన్న, ముత్యాలమ్మ, బల్లి శ్రీశాంత్, అత్యంజయరీ శకుంతల, ఉంద్రాళ్ళ మల్లమ్మ, తన్నీరు మణి, నెల్లూరు ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

23.24 డివిజన్లలో..

తోటపల్లి గూడూరులో..

వడదెబ్బ నివారణకు సూచనలు

ప్రజాశక్తి -గుడ్లూరు :మండలంలో ప్రజలు వడదెబ్బకి గురికాకుండా ఉండేందుకు మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయి ప్రియాంక ఆశ వర్కర్లని ఆదేశించారు స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రంలో తీవ్రమైన ఎండలు, వేడి గాలులు తగ్గేవరకు ప్రజలకి వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకునే విధానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఉదయం, సాయంత్రం వేళల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలుపుకుని సేవించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. గర్భిణులు, చిన్నపిల్లలకి ప్రతి బుధవారం శనివారం రోగ నిరోధక టీకాలు ఉదయం సమయంలో మాత్రమే వినియోగించాలని తెలిపారు. హెచ్ ఇ ఓఆర్ ఎఫ్ పీహెచ్ఎన్ వరలక్ష్మి ఏఎన్ఎంలు హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు :విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల చెల్లింపులను సరళతరం చేయాలనే ఉద్దేశంతో క్యూఆర్ కోడ్ ను అందుబాటులోకి వచ్చిందని విద్యుత్తు శాఖ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విద్యుత్తు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మీడియాతో మాట్లాడుతూ ఈ అవకాశం మొట్టమొదట నగర పరిధిలోని విద్యుత్తు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అతిత్వరలో జిల్లా అంతటా వస్తుందన్నారు. పరిమితికి మించి విద్యుత్ లోడ్ వాడకంతో తరచూ గృహ వినియోగదారులు ఓల్టేజ్ సమస్యలతో సతమతమవుతున్నారు. తక్కువలోడుతో కనెక్షన్ తీసుకొని అధిక సంఖ్యలో విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల లోడ్ పెరిగి అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిని దష్టిలో పెట్టుకుని ప్రభుత్వం క్రమబద్దీకరణకు గతంలో చెల్లిస్తున్న ధరలో సగం రాయితీ కల్పిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. 50 శాతం రాయితీ క్రమబద్ధీకరణకు జూన్ 30 వరకు గడువు ఉందని ఆయన తెలిపారు.

11న జ్యోతిరావు పూలే జయంతి

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని బస్టాండ్ సెంటరు లో ఈనెల 11న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించనున్నట్లు గుడ్లూరు మండల ఎస్‌సి, ఎస్టి. బిసి. ముస్లిం మైనార్టీ ఐక్య వేదిక కన్వీనర్ షేక్ మహబూబ్ బాషా. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ కమిటీ నిర్వాహకులు యు మల్లికార్జున రావు తెలిపారు. ఈ మేరకు వారు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

అంకమ్మ తల్లి ఆలయానికి వెండి జడ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు గ్రామదేవత అంకమ్మ తల్లి అమ్మవారికి కావలికి చెందిన చలంచాల్య సూర్య ప్రకాశరావు, సీతాదేవి రూ.1,70,000 విలువైన బంగారు తాపద వెండి జడను ఆలయ ఇఒ కార్తీక్ కు మంగళవారం సమర్పించారు. దాంతో పాటు అమ్మవారి అర్చన కోసం 110 వెండి పుష్పాలను కూడా సమర్పిం చినట్లు చెప్పారు. విశ్రాంత ఈఓ ఎన్‌టి రాంకుమార్, ఆలయ పునర్నిర్మాణ కమిటి సభ్యులు మంచిరాజు మురళి, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలోని కాళిదాసు వారి వీధిలో ఉన్న వెంకటరమణ లాడ్జిలో కల్లూరి శివ నాగరాజు (26) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా మంగళవారం గుర్తించారు. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం, పునుగోడు గ్రామానికి చెందిన కల్లూరి శివ నాగరాజు హైదరాబాదులో బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. బేల్దారి పనులు నిమిత్తం మేస్త్రీల వద్ద డబ్బులు తీసుకొని పని చేయకుండా ఎగ్గొడతాడు. ఆన్లైన్ బెట్టింగులు ఆడడంతోపాటు మద్యానికి బానిసై జూదాలు ఆడుతూ అప్పుల పాలయ్యాడు. వివాహం కాలేదు .తండ్రి లేడు. తల్లి మతిస్థిమితం లేకుండా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో జీవితంపై విరక్తి కలిగిన శివ నాగరాజు సోమవారం రాత్రి కందుకూరులోని వెంకట రమణ లాడ్జిలో రూము అద్దెకి తీసుకున్నాడు. రూమ్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా మంగళవారం గుర్తించారు. శివ నాగరాజు మృత దేహాన్నికి కందుకూరు ఏరియా వైద్యశాలలో శవపరీక్ష చేశారు. కందుకూరు పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ సాంబశివయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న శివనాగరాజు

మామిడి పంట దిగనాపే..!

◆టన్ను దిగుబడికే పరిమితం ◆ క్రిమి సంహార ఖర్చులు రావని రైతులు ఆవేదన

ప్రజాశక్తి -కందుకూరు

వరుసగా రెండోసారి మామిడి కొంపముంచింది. పంట దిగుబడి మూడో వంతుకు పడిపోయింది. ఫలరాజా అయిన మామిడి సాగుకు కందుకూరు నియోజకవర్గ పెట్టింది పేరు. ఈ నియోజకవర్గంలో సుమారు 14 వేల ఎకరాలలో మామిడి తోటలున్నాయి. వీటిలోనూ ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లోనే మామిడి తోటల విస్తీర్ణం అత్యధికం. నెల్లూరు జిల్లాలో మామిడి తోటలు కందుకూరు నియోజకవర్గంలోనే ఎక్కువ. మామిడి తోటలకు ఆయువుపట్టు అయిన ఈ నియోజకవర్గంలో గత సీజన్లో మామిడి దిగుబడి 30 శాతానికి మించి రాలేదు. ఈసారి కూడా అదే పరిస్థితి. ఈ సీజన్ లోను మామిడి పంట దిగుబడి 25 నుంచి 30శాతం మధ్యనే ఉంటుంది. పూతలు ఆలస్యంగా రావడం, తామర పురుగు పెత్రేగటం వంటి కారణాలు నియోజకవర్గంలోని మామిడి తోటలను తొలి దశలోనే దెబ్బతీసాయి. ఆలస్యంగానైనా పూతలు దండిగా వచ్చినప్పటికీ వాటిని తామర పురుగు నాశనం చేసింది. పిందెలు పడకుండానే పూతలో రాలిపోయాయి. పడిన కొద్దిపాటి పిందెలలోను ఎక్కువ భాగాన్ని తామర పురుగులు నాశనం చేశాయి. ప్రత్యేకించి ఎర్రనేలలోని మామిడి తోటల్లో పిందెలు నామమాత్రం గానే మిగులుతాయి. ఈ నియోజకవర్గంలో ఎర్ర నేలలో ఎక్కువ శాతం మామిడి తోటలు ఉన్నాయి. ఎర్రనేలలతో పోలిస్తే ఇసుక నేలల్లోని మామిడి తోటల్లో రెండు వారాల ముందుగా పూతలు ఈసారి వచ్చాయి. దీంతో ఇసుకనాలలోని మామిడి తోటలో ఓ మోస్తరగా పిందె పడింది. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ తామర పురుగులు చెలరేగుతాయి. ఎర్రనేలలో ఫిబ్రవరి నెలలో పూతల రావడంతో అప్పటికే ఎక్కువైనా ఉష్ణోగ్రతల వల్ల తామర పురురుగులు దాడి కూడా పెరిగింది. సాధారణంగా ఈ నియోజకవర్గంలో ఎకరాకు 4 టన్నులు వంతెన మామిడి పంట దిగుబడి వస్తుంది. అయితే ఈసారి సగటున ఎకరానికి టన్ను దిగుబడి మాత్రమే కనిపిస్తుంది. ప్రతి వంద మామిడి తోటల్లో ఒకటి రెండు తోటల్లో మాత్రమే మామిడి కాయలు కాస్త దండిగా కనిపిస్తున్నాయి. ఉలవపాడు మండలంలోని ఇసుకనేలల తో పాటు గుడ్లూరు మండలంలో సముద్ర తీరంలో ఉండే రావూరు, చేవూరు ,ఏలూరుపాడు వంటి గ్రామాలలోని మామిడి తోటల్లో ఓ మోస్తరిగా మామిడి పిందేలు కనిపిస్తున్నాయి. ఎక్కడో ఒక తోటలో మాత్రమే దండిగా కాయలు కనిపిస్తున్నాయి. పంట దిగుబడి నా మాత్రం కావడంతో కౌవుల వ్యాపారులు అత్యధికలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ నియోజకవర్గంలోని మామిడి తోటల ఫలసాయాన్ని కౌవులు వ్యాపారులు ముందుగానే కొనుగోలు చేస్తారు. కొందరు వ్యాపారులు మామిడి తోటలకు ఎరువులు వేయడం వంటి పనులు కూడా తామే చేస్తారు. ఇక సస్యరక్షిణకు, క్రిమిసంహారకాలు పిచికారి చేయించుకోవడం కౌవుల వ్యాపారుల బాధ్యతే. కొందరు కూల వ్యాపారులకు ఈసారి క్రిమిసంహారక ఖర్చులు కూడా తిరిగి రావడం కష్టమే అనిపిస్తోంది.

కొన్ని తోటల్లేనే కనిపిస్తున్న మామిడి కాయల గుత్తులు

అసలు మామిడి కాయలు కనిపించని చెట్లు

రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు

నష్ట పరిహారం చెల్లించాలి : సిపిఎం

నెల్లూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్

రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని, చేవూరును టూరిజంగా అభివద్ధి చేయాలని కోరుతూ సోమవారం నెల్లూరు కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో, చే వూరు గ్రామ నిర్వాసితులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సి ఐ టి యు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ఎక్కడైనా పోర్టు నిర్మాణం జరిగితే, ముందుగా నిర్వాసితుల, సమస్యలను పరిష్కరించి ఆ తర్వాత నిర్మాణ పనులు చేపడతారన్నారు. రామాయపట్నంలో ముందు పోర్టు నిర్మాణం చేపట్టారని.. నష్ట పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని, ధ్వజమెత్తారు. సర్వే నెంబర్,553,591, లో, 31.50సెంట్లు చెరువు పోరంబోకు భూములు, గత 50 ఏళ్ల నుంచి నుండి, చేవూరు గ్రామ దళితులు సాగు చేసుకొని జీవిస్తున్నారన్నారు. ప్రారంభ దశలోనే, రోడ్డు కోసం ఎస్సీ భూములు తీసుకున్నారన్నారు. పరిహారం చెల్లించలేదన్నారు. చెరువు పోరంబోకు భూమి అనే పేరుతో నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎపి మారిటోరియం బోర్డు చైర్మన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, దళిత భూములకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు, నూతల పాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చేవురు గ్రామ అవసరాలు రీత్యా 1000మీటర్లు వదిలి వేసి భూసేకరణ చేయాలని, పోర్టుకు అనుబంధంగా, చేవూరు చెరువులో బోట్ ఏర్పాటు చేసి, టూరిజాన్ని అభివద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి ఇరువురు బ్రహ్మయ్య,పిచ్చయ్య,దాస్, చే వూరు రాజగోపాల్, లక్ష్మి పతి, బ్రహ్మయ్య, రమణయ్య, చిన్నమ్మ, గగ్గయ్య, కపయ్య ఉన్నారు.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు :పెట్రోల్ పట్టించుకొని డబ్బులు ఇవ్వకుండా సిబ్బందిపై కత్తితో దాడికి పాల్పడ్డ ఘటన మంగళ వారం చోటు చేసుకొంది. పోలీసుల వివరాల మేరకు తోటపల్లిగూడూ రు పోలీస్ స్టేషన్ పక్కనే వున్న పెట్రోల్ బంక్ లో టీపీగూ దూరు గ్రామానికి చెందిన మీదూరు రామయ్య అలి యాస్ సింహాద్రి, ఏలంబేటీ బాల సుబ్రమణ్యం అలి యాస్ బాలు అనే వారు ఈ నెల 7వ తేదీ సాయంత్రం పెట్రోల్ బంక్ వద్దకు వెళ్ళి పెట్రోల్ పట్టించుకుని, డబ్బు లు ఇవ్వకుండా పెట్రోల్ బంక్ లో పని చేసే వారిని కత్తి చూపించి బెదిరించారు. పెట్రోల్ బంక్ సిబ్బంది ఇచ్చిన రిపోర్టు మేరకు ఎస్ఐ వీరేంద్ర బాబు నిందితులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. కాగా పోలీస్ స్టేషన్ కు ఆనుకొని వున్న పెట్రోల్ బంక్ సిబ్బందిపై కత్తితో బెదిరింపులకు పాల్పడ్డ ఘటన మండలంలో కలకలం సష్టిస్తోంది.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

పద్దెనిమిదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేవిధంగా రాజకీయ పార్టీలు తమ వంతు సహకరించాలని జిల్లా రెవిన్యూ అధికారి జె. ఉదయభాస్కర్ రావు కోరారు. మంగళవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో పేద రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫారం 6 లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫారం 6 లను సంపూర్ణంగా పూర్తిచేసే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు నూతన ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. చనిపోయిన వారిని ఓటరు జాబితా నుండి తొలగించేందుకు వారి మరణ ధ్రువీకరణ పత్రాలను పొందే విధంగా వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. టిడిపి నుంచి రసూల్, వైసిపి నుంచి కోటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నుంచి బాల సుధాకర్, బిజెపి నుంచి శ్రీనివాస్, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు హాజరయ్యారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వై.ఓ. నందన్ పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక 19వ డివిజన్ ఇరుగాలమ్మ దేవస్థానం, మహేశ్వరి నగర్, పాత మున్సిపల్ ఆఫీస్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. రోడ్లపై ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుధ్య విభాగం సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. నగరంలోని ప్రధాన పారుదల కాలువలను అదనపు కమిషనర్ పరిశీలించి కాలువలు ఆక్రమాలకు గురికాకుండా, కాలువలపై నిర్మాణాలు జరగకుండా, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

రహదారులు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

నగర పాలక సంస్థ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలకు సంభందించిన సామాగ్రి రోడ్లను ఆక్రమించి, స్థానికులకు ఇబ్బందిగా మారకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూర్య తేజ వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు.పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 29వ డివిజన్ మహాత్మా గాంధీ నగర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్, రామచంద్రా రెడ్డి నగర్, వి.ఎమ్.ఆర్ నగర్ ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. స్థానిక మహాత్మా గాంధీ ప్రజా పార్కులో ప్రజలకు అవసరమైన వాకింగ్ ట్రాక్, టెన్నిస్ కోర్టు, జిమ్ పరికరాలను అందుబాటులోకి తెచ్చామని, పార్కులో అవసరమైన ఇతర మౌలిక వస్తువులను కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ సత్తార్ భాష, ఇతర ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి-కందుకూరు

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్స్చేంజ్ సుంకం రూ. 2 పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఇక్కడ మాట్లాడారు. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాలను పెంచడం పట్ల మండిపడ్డాడు. వెంటనే పెంచిన పెట్రోల్ ,డీల్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్స్చేంజ్ సుంకం రూ. 2 పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు గంటినపల్లి వెంకటేశ్వర్లు. కొట్టే వెంకయ్య. సైమన్ . షేక్ సుభాని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాలను పెంచడం దారుణమని గంటినపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని గుడ్లూరు మండల సిఐటియు .కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తుందన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దారు నిర్మలానంద బాబా

ఆయకట్టు విస్తీర్ణంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి కోవూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయకట్టు విస్తీర్ణంపై సంబంధిత గ్రామాల్లోని విఆర్‌ఒలు ప్రత్యేక దృష్టి సారించి విస్తీర్ణం పారదర్శకంగా ఉండేలా తగు చొరవ తీసుకోవాలని తహశీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా మండలంలో 2000 పైగా ఈ కెవైసి కార్డుదారులు చేయించుకోవాల్సిన పరిస్తితి ఉందని, వీటిపై సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా నీటి తీరువా వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముక్యంగా ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడా కూడా ఈ వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితి ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ డేకు వచ్చే అర్జీల పరిష్కారంపై ఆయా గ్రామాలకు సంబంధించి రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహశీల్దార్ నాజర్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్ రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

వేసవికాలం ప్రారంభమై ఏప్రిల్ జరుగుతున్నా ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదని జిల్లా కౌలు రైతుసంఘం నాయకులు ముత్యాల గురునాథం నగర పంచాయతీ అధికారులపై మండిపడ్డారు. స్థానికంగానే కాకుండా దగదర్తి, సంఘం మండలాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు వ్యాపారులు కోసం, నిత్యవసరాల సరుకుల కోసం బుచ్చిరెడ్డిపాలెంకు వస్తుంటారని వారు మండుటెండలో ఇబ్బందులకు గురవుతున్నారని వారిని దృష్టిలో ఉంచుకొని కనీసం తాగునీటి వసతులు కూడా కల్పించలేని దుస్థితిలో నగర పంచాయతీ ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దానిపై నగర కమిషనర్ ప్రత్యేక దృష్టి ఉంచి బుచ్చిరెడ్డిపాలెంలోని అన్ని కూడలిలలో చలివేంద్రాలను ఏర్పాట్లు చేయాలన్నారు. లేనిపక్షంలో సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామన్నారు.

కాలి బూడిదైన ఇంట్లోని సామగ్రి

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-సీతారామపురం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన సీతారామపురంలోని పోస్ట్ ఆఫీస్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పోస్ట్ ఆఫీస్ కాలనీకి చెందిన గుజ్జుల శ్రీనివాసులు, రత్నమ్మ దంపతులు పొట్టకూటి కోసం కూలి పనులు నిమిత్తం తిరుపతికి ఇటీవలనే వలస వెళ్లారు. వారి పిల్లలు సోమవారం రాత్రి సమీప బంధువుల ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి వేళలో ఒక్కసారిగా ఇంట్లో పెద్ద పేలుడు శబ్దం రావడంతో చూసేసరికి ఫ్రిడ్జ్ వద్ద విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ తీగల ద్వారా ఇల్లు మొత్తం పూర్తిగా మంటలు అలుముకుని ఇంట్లోని వస్తువులన్నీ కాలి దగ్ధమయ్యాయి. బంధువుల సహాయంతో మంటలను ఆర్పివేయగా అప్పటికే ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమై అపార నష్టం వాటిల్లింది. సుమారు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం కలిగినట్లు స్థానికులు తెలిపారు. నిరుపేదలైన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిజిహెచ్‌లో పాముల బెడద..

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని సర్వజన ప్రభుత్వ వైద్యశాలకు వైద్య చికిత్స నిమిత్తం వచ్చిన రోగులకు, అక్కడ పనిచేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బందికి, పాములు, కుక్కలు తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ప్రసూతి విభాగంలోని ఆపరేషన్ థియేటర్‌లోకి ఏకంగా పాము రావడంతో అక్కడ విధి నిర్వహణలో ఉన్న నర్సింగ్ సిబ్బంది తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగులు తీశారు. విషయం తెలిసిన సెక్యూరిటీ సిబ్బంది ఆ పామును కొట్టి చంపివేయడంతో రోగులు, నర్సింగ్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే అత్యవసర విభాగంలో కుక్కలు సేదతీరుతుంటాయి. అనారోగ్యంతో వైద్యం కోసం వచ్చిన వారు, చికిత్స పొందుతున్న వారిని చూసేందుకు వచ్చిన వారి దగ్గర ఉన్న ఆహార పదార్థాల కోసం వెంట పడుతున్నాయి. ఇతర వార్డులోకి వస్తున్నాయి. వైద్యశాలలోకి పాములు, కుక్కలు వస్తున్న విషయం సూపరింటెండెంట్‌కు తెలిసినా పట్టించుకోకుండా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు దారితీస్తుంది. గతంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణంలో ఏర్పడిన జంగిల్, పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సమయంలో ఓ మహిళా కార్మికురాలిపై పాము పడటంతో తీవ్ర భయాందోళనలకు గురికావడం, అనారోగ్యానికి గురైన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యశాలలోకి పాములు, కుక్కలు రాకుండా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కలిగిరి

మండలంలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం రైతు సేవాకేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని కలిగిరి మండల వ్యవసాయ అధికారి ముసునూరు సురేష్ బాబు సూచించారు. ఆధార్ కార్డు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ట్రాక్టర్ ఆర్‌సి కాపీ జెరాక్సులతో రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారన్నారు. అనంతరం రాయితీ నగదు పోను మిగతా నగదును రైతువాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలంలోని అర్హత గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10న ఉరుసు గంధ మహోత్సవం

ప్రజాశక్తి - ఉదయగిరి : స్థానిక పట్టణంలోని కోనాకాలవ వద్ద వెలసి ఉన్న శ్రీ శ్రీ హజరత్ సూఫీ మహమ్మద్ జైనులాబిదీన్ ఖాదిరియావుల్ చిస్తి బాబా (ఆబిద్ బాబా) 22వ ఉరుసు గంధ మహోత్సవము 10వ తేదీ గురువారం జరుగునని నిర్వాహకులు తెలిపారు. పట్టణ మండల ప్రజలు శుక్రవారం జరుగు ఈ కార్యక్రమం తెల్లవారుజామున మూడు గంటలకు హక్కుదారులైన సయ్యద్ అన్సారి హుస్సేన్ నాగుల భావి వీధిలోని తన గృహం నుండి గంధం బయల్దేరి దర్గాకు చేరునని వారు తెలిపారు. ఈ సందర్భంగా గంధంను భారీ ఊరాగింపుగా దర్గాకు చేరుకుంటుందని కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జరుగు ఉరుసు గంధ మహోత్సవమును విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆలయంలో దేవదాయశాఖ డిఇ సందర్శన

ప్రజాశక్తి-సంగం : స్థానిక శివాలయంలో ఉన్న పాకనాటి పతి వ్రతమ్మ ఆలయాన్ని మంగళవారం దేవాదాయశాఖ డిఇ శ్రీనివాసులు, టిడిపి నాయకులు సందర్శించారు. ఆలయంలో చేపట్టవలసిన అభివృద్ధిపై గ్రామస్థులు, నిర్వాహకులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా డిఇ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆదేశాలతో నియోజకవర్గంలో 80 దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. మండలంలో 15 దేవాలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎఇ మురళి, టిడిపి నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఆశావర్కర్లకు అవగాహన

ఉదయగిరిలో...

ప్రజాశక్తి - ఉదయగిరి

గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.శివకల్పన ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త వేసవి కాలంలో 200 ఒ.ఆర్.ఎస్. ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలని, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 500 ఒ.ఆర్.ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలని తెలియజేశారు. ఎవరైనా వడదెబ్బకు గురైనచో వారికి ఒ.ఆర్.ఎస్ ద్రావణం అందించాలని తెలియజేశారు. ప్రతి ఆశా కార్యకర్త వేసవికాలంలో పనిచేసే ఉపాధి కూలీలు, గొర్లు, పశువుల కాపరులకు ఒ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. ప్రతిఒక్కరూ 11గంటల లోపు పనిచేసే విధంగా అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఫైలేరియా కార్యక్రమంలో భాగంగా 18మంది ఫైలేరియా రోగులకు ఫైలేరియా కిట్లను పంపిణీ చేశారన్నారు. గల్ల పాజిటివ్ క్షయ వ్యాధి గ్రస్తుల 18 సంవత్సరాలు నిండినకాంటాక్ట్ పర్సన్‌లకు సై-టీబీ టెస్ట్ డోసు ఇవ్వాలని తెలియజేశారు. ఆశా కార్యకర్తలకు కేటాయించిన ఈ యాప్‌లను అప్డేట్ చేసుకోవాలని తెలియజేశారు. ఆశా కార్యకర్తలు వారి పరిధిలోని అందరు అర్హులైన దంపతులను అప్డేట్ చేసుకోవాలని తెలియజేశారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రతి గర్భిణీకి అవగాహన కల్పించాలని తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు అందించాల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో సి.హెచ్.ఒ శివకుమారి, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి. వెంకటసుబ్బయ్య, పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

ఎఎస్‌పేటలో

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఆశా వర్కర్లకు వారి విధులలో పలు అంశాలపై డాక్టర్ మంజుల సురేష్‌బాబు సూచనలు చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నెలవారీ ఆశా కార్యకర్తలతో, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా డిఎంహెచ్‌ఒ వి.సుజాత పాల్గొని, ఆశా వాలంటీర్లతో వారి విధులకు సంబంధించిన విషయాలను, అడిగి తెలుసుకున్నారు. వారు నిర్వహిస్తున్న వివిధ సర్వేలను, ఒక్కొక్కటి అడిగి తెలుసుకున్నారు. విధులలో అలసత్వం వహించకుండా ప్రతి విషయాన్ని క్షుణంగా తెలుసుకొని, ఫీల్డ్ లెవల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. సమావేశంలో డాక్టర్ సురేష్ బాబు, మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడులో..

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఫైలేరియా బాధితులకు కిట్లను ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషద్ భాషా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 61 మంది ఫైలేరియా బాధితులు ఉన్నారన్నారు. వారికి టబ్బు, మగ్గు, టవళ్లు, సబ్బులు, ఆయింట్మెంట్, వంటి వస్తు సామాగ్రితో కూడిన చెట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కరిష్మా, సిహెచ్‌ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. ముందుగా వైద్య సిబ్బంది ఫైలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యాధిగ్రస్తులకు తెలియచేశారు. ఫైలేరియా కిట్లు వాడకం గురించి వారికి అవగాహన కల్పించారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలో 115 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఖాదర భాషా, జలీల్, మాధవ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథి యానాదిశెట్టి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కావలి

మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ ఎఎంసి చైర్మన్, టిడిపి కావలి పట్టణ మాజీ అధ్యక్షులు గ్రంథి యానాదిశెట్టి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం మంత్రులు అనగాని సత్యప్రసాద్, బిసి జనార్దన్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు రాష్ట్రమంత్రుల రాకతో.. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర రెండవసారి ఎంఎల్‌సిగా ఎన్నికైన సందర్భంగా ఏర్పాటు చేసిన పౌర సన్మాన సభ సందర్భంగా కావలి పట్టణంలో ఎటు చూసినా పసుపుమయంగా కనిపించింది. స్థానిక ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్‌ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రాష్ట్ర రోడ్ల, భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, ఎంఎల్‌సి బీద రవిచంద్ర, రాష్ట్ర, జిల్లా నేతలు, టిడిపి కుటుంబ సభ్యులతో కావలిలో పండుగ వాతావరణం నెలకొంది. కావలి నియోజకవర్గంలోని నలుమూలల నుండి భారీగా బైక్‌లతో తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ముసునూరులోని ఎంఎల్‌ఎ కార్యాలయం నుండి గ్రంథి యానాది శెట్టి విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. గ్రంథి యానాదిశెట్టి విగ్రహాన్ని మంత్రులు, ఎంఎల్‌ఎ గ్రంథి కుటుంబ సభ్యుల మధ్య ఆవిష్కరించారు. అనంతరం గ్రంథి చేసిన సేవలను వారు కొనియాడారు. కావలి అభివృద్ధికి ఆయన అవిశ్రాంతంగా పనిచేశారని తెలిపారు.

విగ్రహావిష్కరణలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, బి.సి. జనార్దన్‌రెడ్డి, ఎంఎల్‌ఎ కృష్ణా రెడ్డి, ఎంఎల్‌సి బీద రవిచంద్ర

పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి-కావలి

పెరిగిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒకేసారి గ్యాస్ సిలిండర్‌కు రూ.50 పెట్రోల్, డీజిల్‌కు రూ.2 పెంచి ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలు, ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఇతర యూజర్ ఛార్జీలు పెరిగి ప్రజలపై మోయలేని భారం పడిందన్నారు. దానివల్ల ప్రజల ఆర్థిక పరిస్థితులు చాలా ఇబ్బందిగా ఉన్నాయన్నారు. పరిపాలించే పాలకులు ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా, ఇప్పటికే సమస్యలతో సతమతమవుతున్న ప్రజలపై మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందాగా మళ్ళీ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి భారాలు వేయడం చాలా దుర్మార్గమైన విషయమన్నారు. పాలకులు గద్దెనెక్కిన దగ్గర నుండి రకరకాల పేర్లతో ప్రజలపై ఆర్థికపర మైనభారాలు మోపుతున్నాయన్నారు. పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో ఉధృతంగా పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మూలె వెంగయ్య ఆధ్వర్యంలో ఎన్నికైన నూతన కమిటీ

రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సిద్ధవరపు ప్రభాకర్ రెడ్డిని, కార్యదర్శిగా లేబూరు యాదగిరి, ఏడుగురితో కమిటీ ఏర్పాటు ఎన్నుకున్నారు. అనంతరం మూలె వెంగయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో రైతాంగ సమస్యల పరిష్కారం నిత్యం పోరాటం చేస్తామన్నారు. మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని వ్యతిరేకిస్తామన్నారు. రైతు పండించిన అన్ని పంటలకు ప్రభుత్వమే మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. 11వ తేదీ రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. అలాగే భవిష్యత్తులో రైతు సంఘ సభ్యత్వాలు నమోదు చేయాలని కమిటీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌పై విచారణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తున్న లక్ష్మీ కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు నిమిత్తం రెండోసారి మళ్లీ డాక్టర్‌పై విచారణ మంగళవారం నిర్వహించారు. ఈ విచారణ జిల్లాలోని ఐదుగురు అధికారులు వరుసగా డిఎంహెచ్‌ఒ వి.సుజాత, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, ఆత్మకూర్ ఆర్‌డిఒ పావని, ఎపి ఎంఐపి పిడి, ఎస్‌సి కార్పొరేషన్ డిడి శ్రీనివాసులు, డి సి హెచ్ ఎస్ శేషారత్నం కలసి హాస్పిటల్ డాక్టర్‌తో విచారణ చేపట్టారు. తదుపరి హాస్పిటల్‌లోని సిబ్బంది అందరితో స్టేట్మెంట్ రాయించుకున్నారు. విచారణ అనంతరం డిఎంహెచ్‌ఒ వి సుజాత పత్రికా విలేకరులతో మాట్లాడుతూ స్టాఫ్‌నర్స్ లక్ష్మి గతంలో ఫిబ్రవరి 5వ తేదీన చేసిన విచారణ సమర్థవంతంగా జరగలేదని మళ్లీ ఓ మారు కలెక్టర్ ఆఫీస్‌కు గ్రీవెన్స్ సందర్భంగా వినతిపత్రం అందజేయడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఐదుగురు అధికారులతో విచారణ జరిపి, పూర్తి వివరాలను సేకరించాలని తెలపడంతో విచ్చేశామని, మరో రెండు మూడు రోజుల్లోనే జాయింట్ కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలియజేశారు.

విచారణ చేపడుతున్న అధికారులు

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-సంగం

వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద అగ్రికల్చర్ సిబ్బంది రైతులకు రాయితీ విధానంలో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మండల అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి పాల్గొని రైతులకు వ్యవసాయ పని ముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు వ్యవసాయ పని ముట్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు సబ్సిడీ విధానంలో వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నామన్నారు. ఇది రైతుల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ ఎఇఒ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

అందని 'ఉపాధి' కూలి..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ పనికి వెళ్లిన కూలి డబ్బులు రాలేదని పత్రికా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 11 వారాలుగా ఉపాధి హామీ పనికి వెళ్లామని, కానీ ఇంతవరకు పనికి సంబంధించిన డబ్బులు మా అకౌంట్లలో జమ కాలేదని వాపోయారు. కావున ఉపాధి హామీ కూలీలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి కూటమి ప్రభుత్వ నాయకులు, ఉన్నతాధికారులు ఉపాధి హామీ కూలీలకు జాప్యం లేకుండా, ఏ వారానికి ఆ వారం డబ్బులు వచ్చే విధంగా, పనితీరును మెరుగు పరుచుకోవాలని ఉపాధి హామీ కూలీల పట్ల ఒకింత శ్రద్ధ వహించాలని ఆయా గ్రామాల ఉపాధి హామీ కూలీలు కోరుకుంటున్నారు.

'నలంద ఈ-టెక్నో'లో వార్షికోత్సవం

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని స్థానిక వెంగళరావు నగర్‌లో ఉన్న నలంద ఈ టెక్నో పాఠశాలలో 13వ వార్షికోత్సవంను నలంద యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కావలి ఆర్‌డిఒ ఎం. సన్నీ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్, రెండవ పట్టణ సిఐ గిరిబాబు పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అదరగొట్టగా, వచ్చిన అతిథులచే విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కావలి ఆర్‌డిఒ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల తోనే జీవితం అయిపోలేదని రాబోయే రోజుల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్. మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ద్రవ్యం దాని విలువను ప్రతి విద్యార్థికి తెలియాలన్నారు. అనంతరం రెండవ పట్టణ సిఐ గిరిబాబు మాట్లాడుతూ నేటి యువత గంజాయి, డ్రగ్స్ వీటికి బానిసలు అవుతున్నారని, వాటిని తీసుకుని ఎంతో మంది యువత పెడద్రోవ పడుతున్నారని వారి జీవితం అర్ధాంతరంగా నాశనం చేసుకుంటున్నారన్నారు. నలంద విద్యా సంస్థల అధినేత ఎండి మజహర్, కావలి ఆర్‌డిఒలు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలతోనే జీవితం అయిపోలేదని రాబోయే రోజుల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని విద్య విలువను ప్రతి విద్యార్థికి తెలియాలని కోరారు. అనంతరం రెండవ పట్టణ సిఐ గిరిబాబు మాట్లాడుతూ నేటి యువత గంజాయి, డ్రగ్స్ వీటికి బానిసలు అవుతున్నారని, వాటిని తీసుకుని ఎంతో మంది యువత పెడద్రోవ పడుతున్నారని వారి జీవితం అర్థంతరంగా నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు మీ బిడ్డల పట్ల అప్రమత్తంగా ఉండాలని తప్పుదోవ పట్టే వారిని సన్మార్గంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో నలంద విద్యా సంస్థల డైరక్టర్‌లు వసీం, పహీమ్, ప్రిన్సిపాల్ ఫరిద బేగం, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం దంత సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు డాక్టర్ జ్యోతి ప్రభ మాట్లాడుతూ నోటి ఆరోగ్యమే దేహ ఆరోగ్యమని, దానిని దృష్టిలో పెట్టుకుని దంత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గుట్కా, పాన్, పొగాకు వంటివి వాడడం వల్ల మానవుని శరీరంలో అనేక భాగాలు ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ నిరంజన్లు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎంఇఒను సన్మానిస్తున్న దృశ్యం

ఎంఇఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి వరికుంటపాడు

వరికుంటపాడు మండల ఎంఇఒ-1గా పోలిపోయిన రమేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఎంఇఒ-2 సిహెచ్ రమణయ్య, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌ఎంటిలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి ఆదూరు పల్లి క్లస్టర్‌కు చెందిన రైతులు 425పొగాకు బేళ్ళను వేలం కేంద్రానికి తీసుకురాగా 299బేళ్ళను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 122పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్‌బి 97ఆర్‌ఆర్ 03సిఆర్ 22కాగా అధిక బరువుతో ఉన్న 04బేళ్ళను వేళానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.262.50నమోదు అయిందన్నారు. కాగా వేలంలో 09మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.

వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు ఐసిపిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఏప్రిల్ 8 నుంచి 22 వరకు నిర్వహించే పౌష్టికాహార పక్షోత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించి పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు మరింత అవగాహన పెంచేలా తగు చొరవ తీసుకోవాలని సిడిపిఒ జ్యోతి అన్నారు. కోవూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం పౌష్టికాహారం పక్షోత్సవాల ప్రారంభం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణీ వెయ్యి రోజుల గర్భస్థ దశ నుంచి రెండు సంవత్సరాల వరకు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా చూడాలన్నారు. అదేవిధంగా లబ్ధిదారులు స్వయంగా తామంతట తామే పోషణ ట్రాకర్లలో నమోదు చేసుకునే విధానంపై తగు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలను నిర్వహించడం వల్ల తద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంపై ప్రత్యేక అవగాహన కల్పించేలా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రాధిక, ప్రసన్న, శకుంతల, ఉమా, ప్రమీలా, సుమిత్ర, పద్మావతి, రమణి, నాగభూషణమ్మలు ఉన్నారు.

మాట్లాడుతున్న సిడిపిఒ జ్యోతి

PUBLIC NOTICE

The General Public is here by informing that Sri. **Chinthala George** S/o **Devasahayam,** residing at Door No.259, Kondayapalem, Nellore City., approached by Client's Bank, i.e., Indusind Bank Ltd., Nellore Branch with a request to advance of Housing Loan by mortgaging his property described below.

Property covered under document No. 5907/2022

SCHEDULE

S.P.S.R Nellore District, Nellore Registration District, Nellore Sub-Registar, Nellore, Municipal Corporation, Kondayapalem, Sy. No. 414/2-2 consisting of Ac.3.62 cents of land was divided into Lay-out Plan plots , in it Plot No.25 consisting an extent of 60 ankanams of site, in it Southern Side 27 ankanams or 216 sq.yards of site, in it Door No. 26/1/1903, H.S.C.No. 3311305035337, Assessment No. 1031045811 , admeasuring an extent of 10 ankanams or 720 sq.yards of site, in it R.C.C. Slab House in Ground Floor bounded by :- **East :** Road, **South :** House of Chinthala Rajasekhar, **West :** House of Chemudugunta Ramanaiah, **North :** House of Golusu Prabhavathi. Within these boundaries an extent of 27 ankanams or 216 sq. yards of site , in it 720 sq.mts., of R.C.C. Slab House therein, for this house fixed doors, door frames, windows, ceiling materials, one feet site, current service , meter, wiring, latrine, bathroom, etc., and including with all easement rights.

That on behalf of my client , I caution the General Public , If any person/Institution is having any objections, Interest for the above property , intended person may contact the undersigned with relevant documentary proof substantiating his/her/their objections , claims and disputes , etc., within five (5) days from the date of this notice, failing which my client will proceed with transaction by accepting the above said property as security, as if there are no third party claims or objections in respect of the above the said property and thereafter no claims or objections will be entertained.

S.V. Vijaya Lakshmi, M. Com, B.L.,
Advocate,
D.No.20-1-189, 1 st Floor,
Potti Sriramulu Statue Centre,
Mulapet, Nellore – 524003
Ph: **9866022728, 2306263**

PUBLIC NOTICE

The General Public is here by informing that Sri. **Dorasala Narasimha Reddy,** S/o **Venkata Reddy,** residing at Door No. 26-2-1844, 2 nd Street, Ramachandra Reddy Nagar, Nellore City, approached by Client's Bank, i.e., Indusind Bank Ltd., Nellore Branch with a request to advance of Housing Loan by mortgaging his property described below.

Property covered under document No. 1882/2025

SCHEDULE

S.P.S.R Nellore District, Nellore Registration District, Nellore Sub-Registar, Nellore Municipal Corporation, Padarupalli, Sy. No. 63-2E, at present Ward No.26-1, " Sundaraiah Colony" , Door No. 771/1 (at present as per Municipal Property Tax Receipt Door No. 26-10-771/1) admeasuring an extent of 27 ankanams or 216 sq.yards of site, in it Assessment No. 1031146736 of Vacant site bounded by :- **East :** Site of Sambaiah setty, **South :** 20 ft., width Road, **West :** House of Mule Ramesh, **North :** Others House. Within these boundaries an extent of 27 ankanams or 216 sq. yards of site and including with all easement rights.

That on behalf of my client , I caution the General Public , If any person/Institution is having any objections, Interest for the above property , intended person may contact the undersigned with relevant documentary proof substantiating his/her/their objections , claims and disputes , etc., within five (5) days from the date of this notice , failing which my client will proceed with transaction by accepting the above said property as security, as if there are no third party claims or objections in respect of the above the said property and thereafter no claims or objections will be entertained.

S.V. Vijaya Lakshmi, M. Com, B.L.,
Advocate,
D.No.20-1-189, 1 st Floor,
Potti Sriramulu Statue Centre,
Mulapet, Nellore – 524003
Ph: **9866022728, 2306263**